ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

గురువారం 24 ఏప్రిల్ 2025



ఆటలతో ఆనందం

- నేటి నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు
- జోరుగా పిల్లల ఆట సామగ్రి కొనుగోలు
- పాఠశాలల్లో ప్రోగ్రెస్ కార్డుల పంపిణీ
- జిల్లాలో 74,626 మంది విద్యార్థులు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పుస్తకాలతో కుస్తీ పట్టిన పిల్లలు సెలవుల మూడ్ లోకి వెళ్లారు. గురువారం నుంచి వేసవి సెలవులు ప్రారంభం కానున్నాయి. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పాఠశాలల్లో 2024-2025 సంవత్సరానికి సంబంధించిన ప్రొగెస్ కార్డులు అందజేశారు. విద్యా సంవత్సరం ముగిసిపోవడంతో చిన్నారులు వేసవి సెలవుల్లో ఉల్లాసంగా గడిపేందుకు ప్లాన్‌లు చేసుకున్నారు. ఇప్పటికే ఇంటర్ ఫలితాలు వచ్చాయి. మరో వారం రోజుల్లో పదో తరగతి పరీక్ష ఫలితాలు కూడా రానున్నాయి. పిల్లల విద్యా ప్రణాళికలతో తల్లిదం డ్రులు నిమగ్నమైతే, పిల్లలు మాత్రం ఆటల సందడిలో మునిగిపోనున్నారు. కొన్ని పాఠశాలల్లో ఉచిత సమ్మర్ క్యాంప్‌లు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. సంవత్సరం పాటు పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు ఎదురుచూస్తున్న సెలవుల గురువారం నుంచి మొదలు కానున్నాయి. జూన్ 12వరకు పిల్లలకు ఆటవిడుపుగా మారనుంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 655 పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ, జడ్పీహెచ్‌ఎస్, కేజీబీవీ, టీఎస్ఎంఎస్, డీఎన్‌టీ, ఎంపీపీఎస్, ఎంపీయూపీఎస్, ఎంపీ హెచ్‌ఎస్, ఆర్బీ ఎస్, తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 74,626 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నర్సరీ 240, ఎల్‌కేజీలో 435 మంది, యూకేజీలో 670 మంది, 1వ తరగతిలో 7,066 మంది, 2వ తరగతిలో 6,844 మంది, మూడో తరగతిలో 6,490 మంది, 4వ తరగతిలో 7,569, 5వ తరగతిలో 7,333 మంది, 6వ తరగతిలో 7,913 మంది, 7వ తరగతిలో 7,718 మంది, 8 వతరగతిలో 7,842 మంది, 9వ తరగతిలో 7,548 మంది, 10వ తరగతిలో 6,908మంది ఉన్నారు.

మండలాల్లో చూస్తే బోయినపల్లిలో 2,708 మంది, చందుర్తి 3,048 మంది, ఇల్లంతకుంటలో 4,686 మంది, గంభీరావుపేట 5,701 మంది, కోనరావుపేట 4,533 మంది, ముస్తాబాద్‌లో 5,479 మంది, రుద్రంగిలో 2,622 మంది, సిరిసిల్లలో 16,457 మంది, తంగళ్లపల్లిలో 6,333 మంది, వీర్నపల్లిలో 1,455 మంది, వేములవాడ 12,750 మంది, వేములవాడరూరల్ 1,690 మంది, ఎల్లారెడ్డిపేట 7,169 మంది విద్యార్థులు ఉన్నారు. ఈనెల 24న ప్రారంభమయ్యే వేసవి సెలవుల తరువాత జూన్ 12న బడులు తిరిగి ప్రారంభం కానున్నాయి. దాదాపు నెల రోజుల పాటు వీరి అల్లరి తట్టుకోవడానికి తల్లి దండ్రులు ఆటవిడుపును అందిస్తున్నారు. తల్లిదండ్రులు రకరకాలైన ఆటవస్తువులను కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారులు కూడా సీజన్ బట్టి కొత్తకొత్త రకాల ఆట వస్తువులను తీసుకొచ్చారు. ఈసారి పిల్లలు ఎలక్ట్రానిక్‌కు సంబంధించిన గేమ్‌లను కొనుగోలు చేస్తున్నారు. చిన్నపిల్లలకు ఆటలతో పాటు మేథస్సుకు పదును పెట్టే బిజినెస్ గేమ్స్, వీడియో గేమ్స్‌లపై ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు స్విమ్మింగ్, స్కేటింగ్, టెన్నిస్, బ్యాడ్మింటన్, జిమ్నాస్టిక్స్, బాక్సింగ్, టేబుల్ టెన్నిస్, విభాగాల్లో శిక్షణ ఇవ్వడానికి శిబిరాలు కూడా వెలిశాయి. హ్యాండ్‌బాల్, చెస్ క్రీడలను కూడా విద్యార్థులు ఇష్టపడుతున్నారు. క్రికెట్, షటిల్స్ బ్యాట్ల అమ్మకాలు కూడా జోరుగానే ఉన్నాయి. పిల్లలందరూ ఒకచోట చేరి క్యారంలాంటి ఆటలే కాకుండా పాత కాలపు పచ్చీస్, కైలాసం, ఆటలు ఆడుతున్నారు. వీటి కనుగుణంగానే గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం ఆట సామగ్రి 30 శాతం పెరిగింది. క్యారంబోర్డులు రూ 250 నుంచి రూ 1800, షటిల్‌బ్యాట్లు రూ 100 నుంచి రూ 550, బిజినెస్ గేమ్‌లు రూ 100 నుంచి రూ 200, చెస్‌బోర్డు, కాయిన్‌లు రూ 50 నుంచి రూ 1500 వరకు, టెన్నికాయిట్ రూ 30 నుంచి రూ 80, టీవీ విడియోగేమ్స్ రూ 400 నుంచి రూ 600వరకు, ఇంగ్లీష్ లర్నింగ్ గేమ్స్ రూ 600, ప్లేస్టేషన్‌లు రూ.12 వేలు, తంబోలా రూ 100, ఎలక్ట్రికల్ ఇతర గేమ్‌లు కూడా రూ 1200 వరకు లభిస్తున్నాయి.

● అనుబంధాలను పెంచనున్న సెలవులు

యాంత్రిక జీవితంలో పట్టణాలకే పరిమితమైన పెద్దలతో పాటు పిల్లలు గ్రామాల్లో ఉండే అమ్మమ్మలు, నాన్నమ్మలతో గడిపే సమయమే దొరకదు. శుభకార్యాల సమయంలోనూ, పండుగల సందర్భంగా కలవడమే ఉంటుంది. ఒకటిరెండు రోజులకు మించి పిల్లలు ఊళ్లలో..

మిగతా 8లో





బాధ్యతలు చేపట్టిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీరజ



జిల్లా ప్రధాన న్యాయమూర్తికి పూలమొక్క అందజేస్తున్న ఎస్పీ

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పి. నీరజ బుధవారం మధ్యాహ్నం 1.15గంటలకు బాధ్యతలు చేపట్టారు. కరీంనగర్ 5వ అడిషనల్ సెషన్స్ జిల్లా జడ్జి వెంకటేశ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీరజకు చార్జి అప్పగించారు. సిరిసిల్ల పోక్సో కోర్టు అండ్ 1వ అడిషనల్ సెషన్స్ జిల్లా జడ్జిగా బి. పుష్పలత ఇదే రోజుల బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నీరజను, 1వ అడిషనల్ సెషన్స్ జిల్లా జడ్జి బి. పుష్పలతలను సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు జూపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి వెంకటి, క్రీడల కార్యదర్శి రమేశ్, క్యాషియర్ నరేశ్, కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ

జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన నీరజను ఎస్పీ మహేశ్ బి. గీతే మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం జిల్లా కోర్టు చాంబర్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీరజను ఎస్పీ మహేశ్ బి గీతే మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు.

రాజన్న సేవలో జిల్లా ప్రిన్సిపల్ జడ్జి

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రిన్సిపల్ జడ్జి పి.నీరజ దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన జడ్జికి వేములవాడ సబ్‌కోర్టు జడ్జి అజయ్, జూనియర్ సివిల్ జడ్జి జ్యోతికిరణ్మయిలు పూలమొక్కలను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు జడ్జికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక పూజ అనంతరం ఆలయ కల్యాణ మండపంలో అర్చకులు వేదోక్త ఆశీర్వచనం ఇచ్చి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

అలాగే రాజన్న సిరిసిల్ల ఫస్ట్ అడిషనల్ జడ్జి పుష్పలత వేములవాడ శ్రీరాజ రాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నాగిరెడ్డి మండపంలో అర్చకులు వేద ఆశీర్వచనం చేసి లడ్డూ ప్రసాదం అందజేశారు. వెంట ప్రధాన ఆలయ పర్యవేక్షకులు జి శ్రీనివాస్ శర్మ, ప్రోటోకాల్ ఇన్‌చార్జి సింహాచార్యులు, ఆలయ సిబ్బంది ఉన్నారు.

సీనియర్ సివిల్ జడ్జిని కలిసిన బార్ కార్యవర్గం

వేములవాడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ సీనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన అజయ్ కుమార్ జాదవ్‌ను బార్ అసోసియేషన్ కార్యవర్గం సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండ రవి, ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణరెడ్డి, సీనియర్ న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, తిరుమలగౌడ్ తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. వేములవాడ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ బొడ్డు ప్రశాంత్ కుమార్, సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్ జాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సీనియర్ న్యాయవాదులు పెంట రాజు, నాగుల సంపత్ కుమార్, కనికరపు శ్రీనివాస్, బొజ్జ మహేందర్, రాజూరి రమేష్, బీమా మహేష్‌బాబు, రాజశేఖర్, మహిళా న్యాయవాదులు జక్కుల పద్మ, బూర సరిత, నాయిమా నాసారి తదితరులు ఆయనను కలిసిన వారిలో ఉన్నారు.

పోలీస్ సంక్షేమమే లక్ష్యం : ఎస్పీ

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పోలీస్ సంక్షేమమే లక్ష్యమని ఎస్పీ మహేశ్ బి. గీతే అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించే సిబ్బందికి ఎస్పీ హెల్మెట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వీయ రక్షణకోసం ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలన్నారు. అప్రమత్తంగా ఉంటూవిధులు నిర్వహించాలన్నారు. అధిక ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకొని విధులు నిర్వహించే సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల టౌన్ సీఐ కె. కృష్ణ, గ్రీన్‌హోం హౌసింగ్ ఫైనాన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లా కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ కార్యవర్గం



నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారులు

సిరిసిల్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొత్తపల్లి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కెమిస్ట్ భవన్‌లో నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల పరిశీలకుడిగా రాష్ట్ర అర్గనైజింగ్‌కార్యదర్శి అరవింద్, నర్సయ్యలు వ్యవహరించారు. ఎన్నికల అధికారిగా న్యాయవాది చెక్కిళ్ల మహేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా కొత్తపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బోడ రవి, కోశాధికారిగా ఆర్ శ్రీనివాస్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన వారికి రాష్ట్ర పరిశీలకులు ఎన్నికల అధికారితో పాటు అసోసియేషన్ ప్రతినిధులు చేపూరి రాజేశం, చేపూరి బుచ్చయ్య, కనకరాజేశం, దేవదాస్, మండలాల కెమిస్ట్‌లు అభినందనలు తెలిపారు.

శ్రామికవర్గ హక్కులను కాపాడుకోవాలి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : అమరవీరుల స్ఫూర్తితో శ్రామిక వర్గ హక్కులను కాపాడుకునేందుకు కార్మికులంతా ఐక్యం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి కోడం రమణలు కోరారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్‌శుక్లా కార్మిక భవనంలో బుధవారం సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మేడేకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 1న జిల్లా వ్యాప్తంగా జరిగే ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే కార్యక్రమాలలో జిల్లాలోని కార్మికవర్గం కష్టజీవులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జిల్లా సహాయ కార్యదర్శి అన్నల్‌దాస్ గణేష్, నాయకులు మాల్యాల నర్సయ్య, బుర్ర శ్రీనివాస్, మల్లయ్య, శ్రీనివాస్, రవీందర్, అంజయ్య, శ్రీను, నర్సయ్య పాల్గొన్నారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

- జిల్లా స్థాయి ఆహ్వానిత వాలీబాల్ పాటీలు ప్రారంభం



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో బుధవారం వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఆహ్వానిత వాలీబాల్(పురుషుల) పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు ఉత్సాహంగా.. ఉల్లాసంగా వాలీబాల్ పోటీలకు తరలివచ్చారు. సాయంత్రం సిరిసిల్ల పట్టణం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈ పోటీలను కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ ప్రారంభించారు. బుధవారం, గురువారం రెండు రోజుల పాటు ఫ్లడ్ లైట్ల వెలుతురులో జరుగుతున్న ఈ పోటీలకు జిల్లా పరిధిలోని 16 జట్లు పోటీలో పాల్గొన్నాయి. జిల్లాస్థాయిలో జరుగుతున్న ఈ వాలీబాల్ పోటీలను తిలకించడానికి క్రీడాభిమానులు, ప్రజలు, యువతీయువకులు పెద్దసంఖ్యలో ఆసక్తి చూపారు. ఈ కార్యక్రమంలో వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చెన్నమనేని శ్రీకుమార్, ప్రధాన కార్యదర్శి అజ్మీరా రాందాస్, ఉపాధ్యక్షుడు చింతకింది శ్యాంకుమార్, సంగ స్వామి, కోశాధికారి కోడం శ్రీనివాస్, టౌన్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి బుర్ర నారాయణ, మాజీ అధ్యక్షుడు గుడ్ల రవి, మాజీ కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి : కలెక్టర్



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదువుతూ భవిష్యత్తులో ముందుకు సాగాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. ఇంటర్మీడియేట్ ఫలితాలు విడుదల కాగా వేములవాడ మైనార్టీ సంక్షేమ గురుకుల విద్యాలయానికి చెందిన హేమంత్ ఇంటర్ మొదటి సంవత్సరం ఎంఎల్‌టీలో 496 మార్కులు సాధించి రాష్ట్ర మొదటి ర్యాంక్‌ను సాధించాడు. అలాగే ఎల్ఎండీటీలో అదిల్‌షరీఫ్ 483 మార్కులు సాధించి రాష్ట్ర రెండో ర్యాంక్‌లను సాధించారు. ద్వితీయ సంవత్సరంలో ఎల్ఎండీటీలో ఎండా షారుక్ 969, ఎంఎల్‌టీలో సంజయ్ 962 లతో రాష్ట్రస్థాయి ర్యాంకులను సాధించారు. వీరితోపాటు ద్వితీయ సంవత్సరంలో 31కి 16మంది విద్యార్థులు 900లకు పైగా మార్కులు సాధించారు సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి భారతితో కలసి విద్యార్థులు కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను కలువగా వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మే డేను విజయవంతం చేద్దాం..

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అరుణ్ కుమార్

వీర్నపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో మే డే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బుధవారం కరపత్రాలను ఆవిష్కరించారు. కార్మికులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమానికి ప్రధానవక్తగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టి స్కైలాబ్ బాబు వస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మల్లారపు అరుణ్ కుమార్ మాట్లాడుతూ మే 1న కార్మిక దినోత్సవం సందర్భంగా వాడవాడలా ఎర్రజెండాలు ఎగురవేయాలని అన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు వెంకట్, రాజేల్లయ్య, నరేందర్, దేవయ్య, గ్రామపంచాయతీ కార్మికులు నర్సయ్య, వినీత్, నాగేష్, హమాలీ సంఘం నాయకులు రాజేశం, నాయకులు శంకర్, అంజయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వర్గం సంఘటితంగా పోరాడాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : కార్మిక చట్టాల పరిరక్షణకు కార్మికవర్గం సంఘటితంగా పోరాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ కార్మిక వ్యతిరేక వైఖరిని కలిగి ఉన్నాడని, కార్పొరేట్ శక్తులకు వనరులను దోచిపెటడానికి మార్గాలను సుగమనం చేస్తున్నాడని ఆరోపించారు. మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో దేశంలోని 30 కోట్ల కార్మికులు పాల్గొంటున్నారని అన్నారు. దేశంలో ఉన్న దాదాపు 10 కోట్ల మంది గ్రామీణ ఉపాధిహామీ కార్మికులు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంతం రవి, మీసం లక్ష్మన్ పాల్గొన్నారు.

నేడు 'సెస్' 51వ మహాజనసభ

- 2025-26 అంచనా బడ్జెట్ రూ.678 కోట్లు



సెస్ ప్రధాన కార్యాలయం

సిరిసిల్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఐదు దశాబ్దాల క్రితం సిరిసిల్ల ప్రాంతం అంధకారంలోనే ఉండేది. చీకటి పడితే చాలు ప్రజలు బయటకు వెళ్లడానికే జంకే పరిస్థితులు. గుట్టలు, చెట్లతో గాఢాంధకరంగా నిండి ఉండేది. ఏవైపు నుంచి ఏ విపత్తు వస్తుందోనని భయంతో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని కాలం గడిపిన రోజులు, గుడ్డి దీపాల వెలుతురులో కాలం కరిగిపోతున్న రోజుల్లో ప్రభుత్వ విద్యుత్ సేవలు కూడా సక్రమంగా సిరిసిల్ల ప్రాంతానికి అందేవి కావు. ఏవైనా సమస్యలు వస్తే తెలుపడానికి ప్రస్తుత ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రానికి వెళ్లాల్సివచ్చేది. ఈ సమస్యలను అధిగమించడానికి సిరిసిల్ల ప్రాంత ప్రజలు ఒక్కటయ్యారు. చైతన్యవంతమైన గడ్డగా పేరున్న సిరిసిల్ల ప్రజలు చీకట్లను తరిమివేయడానికి సిరిసిల్ల విద్యుత్ సహకార సంఘాన్ని స్థాపించుకున్నారు. సెస్ సంస్థ స్థాపించి విద్యుత్ వెలుగులు పంచడంతో 55ఏండ్లు గడిచిపోయాయి. గురువారం సిరిసిల్లలోని పద్మనాయక కల్యాణ మండపంలో సెస్ 51వ మహాజనసభ సందర్భంగా వెలుగునీడలను మననం చేసుకుంటే దేశంలోనే సహకార రంగంలో అగ్రగామిగా నిలిచిన సెస్ కనిపిస్తుంది. 2025-26 సంవత్సరానికి రూ.678 కోట్ల అంచనా బడ్జెట్‌ను సభ ముందు ప్రవేశపెట్టనున్నారు. ఒకవైపు అభివృద్ధి, మరోవైపు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు సంస్థ మనుగడకు అడ్డంకిగా మారుతుందనే ఆందోళనలు ఉన్నాయి.

21 అంశాలతో ఎజెండా..

సెస్ మహాసభకు సంబంధించి 21 అంశాల ఎజెండాను రూపొందించారు. అందులో అంచనా బడ్జెట్లు, ఖర్చులతో పాటు ఉద్యోగ సర్వీస్ నియామావళి కోసం బైలా సవరణ, అంశం చేర్చారు. సిరిసిల్ల సెస్ ప్రధాన కార్యాలయ భవనం మరమ్మతులు పేయింటింగ్ 2016లో సిరిసిల్ల జిల్లాగా మారిన సమయంలో మానేరుతీరంలో ఉన్న సెస్ స్టోర్‌కు సంబంధించి ప్రభుత్వం స్వాధీనం చేసుకొని కూరగాయల మార్కెట్‌ను నిర్మించారు. సెస్ స్టోర్‌కు తిరిగి స్థలం కేటాయించలేదు. ఐదెకరాల స్థలంతో పాటు రూ.10 కోట్ల బడ్జెట్ కేటాయించే విధంగా ప్రభుత్వాన్ని కోరుతూ మహాసభలో తీర్మానం ప్రవేశపెట్టనున్నారు. దీంతో పాటు ఎల్లారెడ్డిపేటలో పోలీస్ ఆధీనంలో ఉన్న సెస్ సేవా సదనంను తిరిగి స్వాధీనం చేసుకోవడం, గతంలో బైలాకు విరుద్ధంగా నియామకాలు, పదోన్నతులను పునఃసమీక్షించడానికి కమిటీ నియామకం, విద్యుత్ లైన్లు, మిడిల్‌పోల్స్, కొత్తగా 500 ట్రాన్స్‌ఫార్మర్ల కొనుగోలు, నూతన మండలాల్లో సేవా సదన్‌లు ఏర్పాటు చేసుకోవడం వంటి అంశాలపై మహాసభ చర్చించనుంది.

బకాయిల భారం రూ 883 కోట్లు...

సిరిసిల్ల ప్రాంతానికి వెలుగులను అందించిన సెస్ బకాయిల భారంతో సతమతం అవుతుంది. సెస్‌కు వివిధ కేటగిరీలకు సంబంధించి రూ.883కోట్ల బకాయిలు రావాల్సి ఉన్నాయి. వినియోగదారుల నుంచి రూ.161కోట్లు, ప్రభుత్వం సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమకు అందించే 50 శాతం విద్యుత్ రాయితీ సబ్సిడీ రూ.99.63కోట్లు, ప్రభుత్వం పెండింగ్ బిల్లులు రూ.18.42కోట్లు, జూలై 2020 సంవత్సరానికి ముందు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఎరియర్స్ రూ.319కోట్లు, వ్యవసాయ టారిఫ్ సబ్సిడీ రూ.174కోట్లు, పట్టణ, పల్లె ప్రగతి బిల్లులు రూ.20 కోట్లు, ఇతర బకాయిలు రూ.89కోట్ల వరకు సెస్‌కు రావాల్సి ఉంది. బకాయిల ఇబ్బందులు ఉన్నా సెస్ పాలకవర్గం విద్యుత్ సరఫరాను నిరాటంకంగా అందిస్తోంది.

సెస్‌లో 3.46 లక్షల మంది సభ్యులు

సెస్ పరిధిలో 5.52 లక్షల జనాభా ఉంది. సెస్ పరిధిలో 3.46 లక్షల మంది సభ్యులు ఉన్నారు. సభ్యుల వాటాధనం రూ.6.08 కోట్లు ఉండగా సెస్ ఆస్తులు రూ.241.78 కోట్లకు చేరుకున్నాయి. 1970లో కేవలం 46 గ్రామాలకు విద్యుత్‌ను అందిస్తే... ప్రస్తుతం 255 గ్రామాలకు, శివారు పల్లెలకు పూర్తిస్థాయిలో విద్యుత్ సేవలను అందిస్తోంది. 4,720 కనెక్షన్‌ల నుంచి ప్రస్తుతం 2.76 లక్షలకు చేరుకుంది. ఇందులో వ్యవసాయ కనెక్షన్‌లు 75 వేల 596 ఉంటే గృహ అవసరాలకు 1,69,864, కుటీర పరిశ్రమకు 3,874, వ్యాపార కనెక్షన్లు 20,297, ఎల్‌టి పారిశ్రామిక కనెక్షన్‌లు 2,079, పవర్‌లూం కనెక్షన్‌లు 4,431కు పెరిగాయి. మొదట్లో 132/33కెవి సబ్‌స్టేషన్‌లే లేకపోగా ఇప్పుడు ఆరు సబ్‌స్టేషన్‌లను సమకూర్చుకుంది. 33/11కెవి సబ్‌స్టేషన్‌లు 1 ఉంటే, ప్రస్తుతం76కి పెరగగా, 11కెవి ఫీడర్లు 279, వ్యవసాయ ఫీడర్లు 177, మిక్స్‌డ్ కేవీ ఫీడర్లు 99, 11 కేవీలైన్లు 6534, ఎల్‌టి లైన్లు 8552, 6.3 కేవీ లైన్లు 1049కు పెరిగాయి. రాష్ట్రంలో ఏడు విద్యుత్ సహకార సంఘాలు ఏర్పడినా వాటిలో సెస్ మాత్రమే అన్ని గ్రామాలను విద్యుదీకరించి అగ్రగామిగా నిలిచింది.

నాణ్యమైన సేవలు అందిస్తున్నాం..

- చిక్కాల రామరావు, సెస్ చైర్మన్



సెస్ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన సేవలను అందిస్తున్నాం. సెస్‌లో ఉద్యోగుల కొరత ఉన్నా ప్రస్తుతం ఉన్న ఉద్యోగులతో క్షేత్రస్థాయిలో సేవలు అందిస్తున్నాం. ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిల విడుదలకు ప్రయత్నం చేస్తున్నాం. జిల్లాలో 132/33 కేవీ కేంద్రాలను నేరేళ్ల, బోయినపల్లిలో ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాం.

మహనీయుల జయంత్యుత్సవ ఆహ్వాన పత్రిక అందజేత

ఇల్లంతకుంట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర జరిగే మహనీయుల జయంత్యుత్సవ సమావేశానికి హాజరు కావాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కమిటీ నాయకులు వేములవాడలో బుధవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. బహుజన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కన్వీనర్ సావనపెల్లి రాకేష్, నాయకులు తీపిరెడ్డి తిరుపతిరెడ్డి, ఏనుగుల లింగన్న, ఉస్మాన్, సావనపెల్లి శంకర్ తదితరులు ఉన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

వేములవాడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్(ఐసీఐ) రీజినల్ ప్రెసిడెంట్ కుతాడి తిరుపతి అన్నారు. వేములవాడ పట్టణంలోని తెలంగాణ గిరిజన బాలికల గురుకుల విద్యార్థులకు బుధవారం ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఉచిత మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవుల సమయంలో చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ ఒక నిర్ణీత లక్ష్యాన్ని ఏర్పరుచుకొని తమకు ఉన్న సమయాన్ని సరిగ్గా వినియోగించుకొంటే విజయానికి దగ్గరవుతారన్నారు. ఐసీఐ రీజినల్ డైరెక్టర్ ఆవుల సుధాకర్ మాట్లాడుతూ సెలవుల సమయంలో తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉండాలని సూచించారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై కేసు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదానికి కారణమైన సంఘటనలో మండల కేంద్రానికి చెందిన వాహన డ్రైవర్ మేఘ రాజుపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ బుధవారం తెలిపారు. ఈనెల 22న రాత్రి పెద్దపల్లి జిల్లాలోని రాఘాపూర్‌కు చెందిన ఏనుగుల సదయ్య తన వరికోత యంత్రంతో మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లోని వరికోసి ఎల్లారెడ్డిపేట వైపు వెళ్తున్నాడన్నారు. మండల కేంద్రంలోని మేఘరాజు కారును అతివేగం, అజాగ్రత్తగా నడిపి వరికోత యంత్రాన్ని వెనుకనుంచి ఢీకొట్టాడని చెప్పారు. ప్రమాదంలో వరికోత యంత్రం భాగాలు ధ్వంసమయ్యాయని, సుమారు రూ.5 లక్షల నష్టం వాటిల్లిందని తెలిపారు. బాధితుడు సదయ్య ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ మేఘ రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

దొంగతనం కేసులో నిందితుడికి జైలుశిక్ష

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ స్టేషన్ పరిధిలోని బాలపల్లి, జాబితాపూర్ గ్రామాల్లో గల కొత్తరాజేశ్వరస్వామి, లలితపరమేశ్వరి ఆలయాల్లో 2024 అక్టోబర్‌లో దొంగతనానికి పాల్పడ్డ తాటిపల్లి గ్రామానికి చెందిన వడ్లూరి నాగరాజుకు అనే నిందితుడికి 4 నెలల 11 రోజులు జైలు శిక్షతో పాటు రూ.400 జరిమానా విధించారు. కోర్టులో కానిస్టేబుల్‌రామకృష్ణ సాక్షులను ప్రవేశపెట్టగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజని వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలు రుజువుకావడంతో బుధవారం నిందితుడికి శిక్ష విధిస్తూ జడ్జి శ్రీనిజ కొహిర్కర్ తీర్పు వెలువరించారు.

చెరువులో యువకుడి గల్లంతు

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలలోని చింతకుంట చెరువులో బుధవారం పట్టణానికి చెందిన నీలి మల్లికార్జున్(35) అనే యువకుడు గల్లంతయ్యాడు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం పట్టణానికి చెందిన నీలి భీమక్క అనే వృద్ధురాలు మృతిచెందగా మనవడి వరస అయ్యే మల్లికార్జున్ దినకర్మకు హాజరయ్యాడు. అనంతరం స్నానం చేయడానికి చెరువులోకి దిగాడు. చెరువులోని ఒక ఒడ్డు నుంచి మరో ఒడ్డుకు ఈత కొడుతుండగా మధ్యలోనే మునిగిపోయాడు. రెండు ఒడ్ల మధ్య సుమారు 150మీటర్లకు పైగా దూరం ఉండడంతో ఈదలేక మధ్యలోనే మునిగిపోయాడని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. అయితే బంధువులు అతడిని కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. పోలీసులు గజఈతగాళ్ల సహాయంతో చెరువులో గాలింపు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు.

వేర్వేరు ప్రాంతాల్లో వడదెబ్బతో ఇద్దరి మృతి


రమేష్(ఫైల్)

రామడుగు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన కల్లెం రమేష్(55) వడదెబ్బతో మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రమేష్ వివిధ పనుల నిమిత్తం ఎండలో తిరిగాడు. సాయంత్రం ఇంటికి చేరుకున్నాడు. రాత్రివాంతులు,విరేచనాలతో బాధ పడుతూ అర్ధరాత్రి మృతిచెందినట్లు తెలిపారు.

యైటింక్లయిన్‌కాలనీ: వడదెబ్బతో కాలనీలో పుల్లూరి రమేష్(37) అనే వ్యక్తి బుధవారం మృతి చెందాడు. కాలనీలో ఉంటూ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న రమేష్ మూడు రోజుల పాటు విధులకు వెళ్లి బుధవారం ఇంటికి వచ్చాడు. నీరసంగా ఉన్న రమేష్‌ను కుటుంబ సభ్యులు గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా వడదెబ్బ తగిలిందని వైద్యులు మందులు ఇచ్చారు. ఆసుపత్రి నుంచి ఇంటికి రాగా ఇంటి ముందు రమేష్ కుప్పకూలాడు. బంధువులు గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే రమేష్ మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.



అధిక లోడ్‌తో అదనపు బిల్లు

● మీటర్లపై భారం పడకుండా చూస్తే మంచిది

● అవసరానికి అనుగుణంగా మీటర్ తీసుకుంటే మేలు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వేసవిలో విద్యుత్ పొదుపు పాటించకుంటే అదనంగా చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. బిల్లు అధికంగా వస్తే అదనంగా డెవలప్‌మెంట్ చార్జీలు చెల్లించాలి. ఈ బిల్లులు అధికంగా వచ్చిన సమయంలో డెవలప్‌మెంట్ చార్జీలు చెల్లించాలని విద్యుత్ అధికారులు నోటీసులు జారీ చేస్తారు. మీటర్‌కు దరఖాస్తు చేసుకున్న సమయంలోనే వినియోగదారుల్లో చాలామంది ఒక కిలోవాట్ సామర్థ్యం చాలంటూ డీడీలు చెల్లిస్తారు. ఆ సమయంలో నాలుగు బల్బులు, రెండు ఫ్యాన్లు, టీవీ ఉన్నట్లు పేర్కొంటారు. తర్వాత ఇంట్లో కూలర్లు, ఏసీలు, ఫ్రిజ్లు, వాషింగ్ మిషన్లు, రైస్ కుక్కర్లు, గీజర్లు అదనంగా వచ్చి చేరుతుంటాయి. దీంతో దరఖాస్తు చేసుకున్న దానికంటే అధికంగా లోడు పెరిగి భారం విద్యుత్ ఫీడర్లపై పడుతుంది. దీంతో విద్యుత్ అధికారులు అధిక భారాన్ని అధిగమించడానికి కొత్త విద్యుత్ స్తంభాలు, విద్యుత్తు లైన్లు వేయాల్సి ఉంటుంది. ఇందుకయ్యే ఖర్చును ఎవరైతే అధిక లోడు విని యోగించుకుంటున్నారో వారిపై వేస్తారు.

● **అవగాహన లేక..:** డెవలప్‌మెంట్ చార్జీల విషయమై చాలా మందికి అవగాహన ఉండదు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తుంటారు. ముందుగా ఇంట్లోకి అదనంగా ఉపకరణాలు తీసుకొస్తే వాటికి విద్యుత్ ఎంత అవసరమో తెలుసుకోవాలి. విద్యుత్ అధికారులతో మాట్లాడి మీటర్ పరిధిని మార్చాలని దరఖాస్తు చేసుకోవాలి. అదనంగా కిలోవాట్‌కు 1,200 రూపాయలు సెక్యూరిటీ డిపాజిట్ కింద 200 రూపాయలను మీసేవలో చెల్లిస్తే మీటర్ పరిధి వారం రోజుల్లో మారుతుంది. దీంతో అధిక చార్జీలు ఉండవు. ఒకేసారి వినియోగించినప్పుడు అధిక లోడ్ నమోదవుతుంది. ఈ సమస్యను నుంచి బయటపడాలంటే మీటర్ల సామర్థ్యం పెంచుకోవడమే ఉత్తమమని విద్యుత్ అధికారులు చెబుతున్నారు.

మీటర్లపై భారం పడకుండా చూడాలి

మేక రమేశ్‌బాబు, టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ



మీటర్ తీసుకునే ముందు ఎన్ని కిలో వాట్లు అవసరం ఉంటుందో విద్యుత్ అధికారులకు చెబితే బాగుంటుంది. అధిక చార్జీల భారం పడకుండా ఉంటుంది. తక్కువ కిలోవాట్‌కు డిపాజిట్ చెల్లించి ఆ తరువాత వచ్చే అధిక బిల్లులతో ఇబ్బంది పడొద్దు. కార్యలయాల చుట్టూ తిరిగినా విద్యుత్ బిల్లులు తగ్గకపోగా అదనపు చార్జీల భారం పడుతుంది. విద్యుత్ వినియోగదారులు అధికారులను సంప్రదించి బిల్లులు చెల్లించి అదనపు లోడ్‌ను రెగ్యులర్ చేయించుకోవాలి.

చట్టంతో ఆడుకున్న చెన్నమనేనిని కఠినంగా శిక్షించాలి

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ డిమాండ్

● ఆదిశ్రీనివాస్ వాంగ్మూలం నమోదుచేసిన సీఐడీ పోలీసులు


హైదరాబాదులోని సీఐడీ కార్యాలయం ఆవరణలో విలేకరులతో మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): భారత పౌరుడు కాకుండానే శాసనసభ్యుడిగా పోటీచేసిన మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు చెన్నమనేని రమేష్‌ను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో భారత పౌరసత్వం పొందారని నిర్ధారిస్తూ చెన్నమనేని రమేష్ పౌరసత్వాన్ని హైకోర్టు రద్దుచేసిన నేపథ్యంలో ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ ఆదిశ్రీనివాస్ సీఐడీ పోలీసులకు ఫిర్యాదుచేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం సీఐడీ పోలీసులు ఆది శ్రీనివాస్ వాంగ్మూలాన్ని నమోదు చేశారు. అనంతరం సీఐడీ కార్యాలయం ఆవరణలో ఆది శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ చెన్నమనేని రమేష్‌బాబు భారతీయుడు కాకుండానే భారతీయుడని చట్టసభల్లో అడు గుపెట్టారని, ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు తెలిపారు. చట్టంతో ఆడు కున్న వ్యక్తిని కఠినంగా శిక్షించడం ద్వారా భవిష్యత్తులో ఇలాంటి పొరపాటు ఎవరూ చేయకుండా చూడవచ్చన్నారు. ఎఫ్ఐఆర్ నమోదుకు ముందు రమేష్ బాబు ఏ దేశ పాస్‌పోర్టు మీద భారతదేశానికి వచ్చారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. భారత దేశ పౌరుడైతేనే జడ్పీటీసీగా, ఎంపీటీసీగా, సర్పంచ్‌గా, ఎమ్మెల్యేగా ఎం పీగా పోటీచేయాలని మనదేశ చట్టం చెబుతుందన్నారు. దేశ పౌరుడు కాదని తీర్పువచ్చిన నేపథ్యంలో అధికా రులు విచారణ జరిపి 2009 నుంచి ఎమ్మెల్యేగా ఉన్న కాలాన్ని సరిచేయాలని, ఈ తీర్పుతో న్యాయస్థానాలపై గౌరవం పెరిగిందని, 14 సంవత్సరాల పోరాటంలో తనకు అండగా ఉన్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

కొడిమ్యాల, ఏప్రిల్23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన దుబ్బాక జమున(26) అనే వివాహిత కొద్ది రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం చేయగా మంగళవారం రాత్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కొడిమ్యాల ఎస్సై ఎస్.సందీప్ తెలిపారు. జమునకు గత సంవత్సరం మార్చిలో కొడిమ్యాలకు చెందిన దుబ్బాక రాహుల్‌తో వివాహం జరిగింది. ఆరు నెలల నుంచి ఆమెభర్త రాహుల్, మామ దుబ్బాక లక్ష్మీనారాయణ అదనపు వరకట్నం కోసం వేధింపులకు గురి చేశారని మృతురాలి తల్లి కొమ్ము పోషవ్వ ఫిర్యాదు చేసింది. భర్త, మామ అదనపు వరకట్నం వేధింపులతో ఈనెల 21న ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నం చేయగా జగిత్యాలలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తల్లి పోషవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్యను వేధించిన వ్యక్తికి ఏడాది జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం భార్యను వేధించిన సిరిసిల్ల పట్టణం సిద్దులవాడకుచెందిన కర్లబత్తుల ప్రేమ్‌సాగర్ రావుకు ఏడాదిజైలు శిక్షతోపాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ బుధవారం సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ తీర్పు వెల్లడించినట్లు సిరిసిల్ల టౌన్‌సీఐ కె కృష్ణ తెలిపారు. ఆయన వివరాలప్రకారం... సిరిసిల్ల పట్టణంలోని సిద్దులవాడకు చెందిన కర్లబత్తుల పద్మావతికి మాజీఏఈఈ కర్లబత్తుల ప్రేమ్‌సాగర్‌రావుతో 31సంవత్సరాల క్రితం వివాహమైంది. ఈ దంపతులకు ఇద్దరు కూతుళ్లు. ఏఈఈగా పనిచేసిన ప్రేమ్‌సాగర్‌రావు సస్పెండ్ కావడంతో తాగుడుకు బానిసై తరచూ భార్య పద్మావతిని డబ్బులు అడగడమే కాకుండా ఇవ్వకుంటే కొడుతుండేవాడు. జనవరి 27, 2017న తన భర్త ప్రేమ్‌సాగర్‌రావు ఇంట్లోకి తాగివచ్చి డబ్బులు ఇవ్వమని కొట్టి మానసికంగా వేధించాడని భార్య పద్మావతి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా అప్పటి విచారణ అధికారి లియకత్ అలీ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశాడు. ఈ కేసులో కోర్టు మానిటరింగ్ అధికారి శ్రవణ్‌యాదవ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేశ్ ఆరుగురు సాక్షులను ప్రవేశపెటారు. పీపీసందీప్ వాదించగా కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్ నేరస్థుడైన ప్రేమ్‌సాగర్‌రావుకు ఏడాదిజైలు శిక్షతోపాటు రూ.2వేల జరిమానా విధించారని సీఐ కృష్ణ తెలిపారు.

బోర్ల విద్యుత్ వైర్లు చోరీ

గంగాధర, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం రంగరావుపల్లి, తాడిజెర్రిలో వ్యవసాయ బోర్ల విద్యుత్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడిజెర్రి, రంగరావుపల్లి గ్రామాల్లో బోర్ల డబ్బాలకు ఎప్పటిలాగే మంగళవారం తాళంవేసి వెళ్లారు. బుధవారం పొలాలకు వెళ్లిన రైతులకు డబ్బా నుంచి బోరు మోటారుకు వేసిన వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు కత్తిరించి ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. తాడిజెర్రిలోని ఐదుగురు రైతులు, రంగరావుపల్లిలో ఒక్కరైతుకు చెందిన 4వందల మీటర్లవైరును ఎత్తుకెళ్లారు. వైరు విలువ 52వేలు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు.

నష్టపరిహారం చెల్లించాకే షెడ్డును కూల్చండి

● సబ్‌స్టేషన్ పనులను అడ్డుకున్న బాధితులు


షెడ్డును కూల్చకుండా అడ్డుగా నిల్చున్న బాధితులు

వేములవాడ టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం రుద్రవరం గ్రామానికి మంజూరైన సబ్‌స్టేషన్ స్థలంలోని షెడ్డును సంబంధిత అధికారులు కూల్చేందుకు ప్రయత్నించగా, భూయజమానులు తమకు నష్టపరిహారం అందలేదని, పరిహారం వచ్చిన తర్వాతే షెడ్డును కూల్చాలని పనులను అడ్డుకున్నారు. వేములవాడ మండలం అనుపురం గ్రామానికి చెందిన నాంపల్లి రాజయ్యకు చెందిన 383, 384 సర్వే నంబర్ గల స్థలంలో షెడ్డు ఏర్పాటు చేసుకున్నారు. సదరు షెడ్డుకు ఇప్పటి వరకు నష్టపరిహారం రాలేదని, నష్టపరిహారం చెల్లించిన తరువాతనే షెడ్డును కూల్చాలని భీష్మించుకు కూర్చున్నారు. దీంతో చేసేదేమి లేక సంబందిత అధికారులు అక్కడి నుంచి తిరిగి వెళ్లిపోయారు. నష్టపరిహారం చెల్లించకుండా తమ షెడ్డును కూల్చివేస్తే తరువాత జరుగు సంఘటనలకు అధికారులు బాధ్యత వహించాలని భూయజమాని ఆవేధన వ్యక్తం చేశారు.

అంతర్రాష్ట్ర దొంగ రిమాండ్

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండల పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడిన మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను బుధవారం రిమాండ్‌కు తరలించామని కరీంనగర్ రూరల్ ఏఎస్పీ శుభం ప్రకాశ్ తెలిపారు. ఈ మేరకు విలేకరులకు వివరాలు వెల్లడించారు. గతేడాది జూలైలో కరీంనగర్ రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని గుంటూరుపల్లిలో తాళం వేసి ఉన్న ఇంట్లోకి చొరబడిన దొంగలు 2.25 లక్షల విలువైన బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. అనంతరం మల్కాపూర్ రోడ్డులోని పీవీఆర్ గార్డెన్స్ సమీపంలో కె.రాజేంద్రప్రసాద్ ఇంటి తాళాలు పగలగొట్టి మద్యం సీసాలతో పాటు హీరో హోండా మోటార్ సైకిల్‌ను దొంగిలించారు. ఈ ఘటనలపై కరీంనగర్ రూరల్, కొత్తపల్లి పోలీసులు కేసు విచారణ చేపట్టారు. దర్యాప్తులో నిందితులు మధ్యప్రదేశ్ రాష్ట్రం ధార్ జిల్లాకు చెందిన ప్రదీప్, విక్రమ్, హత్రు సింగ్, జితేన్‌గా గుర్తించారు. కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ పోలీసుఠాణాలో రెండు కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో ప్రధాన నిందితుడైన ప్రదీప్‌ను గత మార్చిలో రిమాండ్‌కు తరలించామని ఏఎస్పీ శుభం ప్రకాశ్ తెలిపారు. ఈ కేసులో మరో నిందితుడైన హత్రుసింగ్ మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లా నరవాలిలో ఉన్నాడని సమాచారం రావడంతో, కొత్తపల్లి ఎస్‌ఐ సాంబమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం అక్కడికి వెళ్లిందని, మంగళవారం నిందితుడిని అరెస్టు చేసి కరీంనగర్‌కు తీసుకొచ్చిందని తెలిపారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు విక్రమ్, జితేన్ పరారీలో ఉన్నారని, వారిని పట్టుకోవడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండల శివారులోని వెలిచాల ఎక్స్ రోడ్డు వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తపల్లి మండలం నాగులమల్యాల గ్రామానికిచెందిన మొగిలిపాలెం గంగరాజు(42) మృతి చెందాడని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. గంగరాజు గంగాధర మండలం సర్వారెడ్డిపల్లిలో పని ముగించుకొని తనబైక్‌పై నాగులమల్యాలకు బయల్దేరాడు. వెలిచాల ఎక్స్‌రోడ్డు వద్ద ఒకలారీ అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో గంగరాజు ఎగిరి రోడ్డుపై పడ్డాడు. తీవ్రగాయాలతో గంగరాజు అక్కడికక్కడే మృతి చెందినట్లు, మృతుడి కొడుకు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అదృశ్యమైన కార్యదర్శి ఆచూకీ తిరుపతిలో లభ్యం..

● 48 గంటల ఉత్కంఠకు తెర

తంగళ్లపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రియాంక తిరుపతిలో దొరికింది. గత రెండు రోజులుగా కార్యదర్శి అదృశ్యంపై రాజన్న సిరిసిల్ల జిల్లాలో కలకాలం ఎట్టకేలకు పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ఆంధ్రప్రదేశ్ తిరుపతిలో ఉన్నట్టు గుర్తించారు. కార్యదర్శి తండ్రి రాజేష్ బంధువులతో కలిసి పోలీసుల సహకారంతో ప్రియాంక ఉన్న చోటుకు బుధవారం చేరుకున్నారు. కాగా, కార్యదర్శి ప్రియాంకను 'ఆంధ్రజ్యోతి' ఫోన్లో సంప్రదించగా, రాజీనామా చేయడానికి గల కారణాలను వివరించింది. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తనను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని అందుకే రాజీనామా చేసి తిరుపతి వెళ్లినట్లు వివరించారు. నిబంధనల ప్రకారం ఉద్యోగం చేస్తే అవమానాలు ఎదురవుతున్నాయని, ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్న పరిశీలించే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. తల్లిదండ్రులు తనను క్షమించాలని వేడుకుంది. కాగా, ప్రియాంకను తీసుకొని తిరుపతి నుంచి బయలుదేరినట్టు, రాత్రి వరకు చేరుకుంటామని కార్యదర్శి తండ్రి రాజేశం తెలిపారు. 48 గంటలుగా కార్యదర్శి అదృశ్యంతో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది.

తండ్రిపై దాడి కేసులో కుమారుడి అరెస్ట్

ధర్మపురి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలం కొసునూర్‌పల్లె గ్రామంలో తండ్రి వేముల సుకేందర్‌రెడ్డిపై రోకలి బండతో దాడి చేసిన కేసులో కొడుకు వేముల విక్రం రెడ్డిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. మార్చి 20న సుకేందర్ రెడ్డితో ఇంటి వద్ద గొడవ పడి కొడుకు విక్రంరెడ్డి రోకలి బండతో గాయపరచినట్లు ఆయన పేర్కొన్నారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న విక్రంరెడ్డిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ జైలుకు పంపించినట్లు ఆయన తెలిపారు.

కారును ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

శంకరపట్నం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామశివారులో బుధవారం కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖనికి చెందిన ఓ కుటుంబం వరంగల్‌లో వివాహానికి హాజరయ్యేందుకు కారులో వెళ్తున్నారు. వరంగల్‌డిపోకు చెందిన బస్సు నిజామా బాద్‌కు ప్రయాణికులతో వెళ్తోంది. మార్గ మధ్యలో కొత్తగట్టు శివారులో కారును బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారుముందు భాగం దెబ్బతింది. విషయం తెలుసుకున్న బ్లూకోల్ట్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కాగా ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

కంకర పోశారు.. తారు వేయడం మరిచారు

మానకొండూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవంపల్లి-కొండపల్కల రోడ్డు నిర్మాణానికి కంకర పోసి నెలలు గడుస్తున్నా ఇంతవరకు తారు వేయలేదు. దీంతో రెండు గ్రామాలకు చెందిన ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై పోసిన కంకరతో ద్విచక్రవాహనాలు అదుపుతప్పి పడిపోతున్నాయి. ఈ రోడ్డుపైన ప్రయాణించాలంటేనే జంకుతున్నారు. మండలంలోని లలితాపూర్ నుంచి దేవంపల్లి వరకు తారు రోడ్డు పూర్తిగా చెడిపోయింది. దీంతో లలితాపూర్ నుంచి దేవంపల్లి మీదుగా కొండపల్కల వరకు ఏడు కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణానికి రూ.2,47,70,000 రూపాయలు మంజూరు అయ్యాయి. ఈ రోడ్డు నిర్మాణం పూర్తైతే కొండపల్కల గ్రామస్థులు దేవంపల్లి, అన్నారం మీదుగా కరీంనగర్ ప్రయాణం సులభమవుతుంది. రోడ్డు నిర్మాణం త్వరగా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


కంకరతో కూడిన దేవంపల్లి-కొండపల్కల రోడ్డు

సిరిసిల్లలో వర్షం

● కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంతోపాటు విలీన గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని పలుప్రాంతంలో చెట్లు విరిగిపోయాయి. అలాగే విలీన గ్రామాలైన పెద్దూర్, పెద్దబోనాల, చిన్నబోనాల, చంద్రంపేట, రగుడు గ్రామాలల్లో ఏర్పాటు చేసి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం వర్షానికి తడిసిపోవడంతో రైతులు ఇబ్బం దులకు గురయ్యారు. కుప్పలపై టార్పాలిన్ కవరు కప్పినా కూడా ధాన్యం తడిసిపోయింది.


పెద్దూర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలపై ఉన్న నీటిని తీసేస్తున్న రైతులు

ఏసీబీ వలలో ఇద్దరు ఎస్సారెస్పీ అధికారులు

● బిల్స్ మంజూరు కోసం సహోద్యోగి వద్ద లంచం డిమాండ్


ఏసీబీకి పట్టుబడిన అధికారులు


బాధితుడు ఇజాజ్

సుల్తానాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సహ ఉద్యోగి మెడికల్ లీవ్ బిల్స్ మంజూరు కోసం 20 వేల రూపాయలు లంచం డిమాండ్ చేసిన ఇద్దరు ఎస్సారెస్పీ ఉద్యోగులు బుధవారం ఏబీసీకి చిక్కారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ శ్రీరాంసాగర్ ప్రాజెక్టు డివిజన్ నంబర్ 6 కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఇజాజ్ ఉల్‌హక్ మూడు నెలలు మెడికల్ లీవ్‌లో ఉన్నాడు. అనంతరం విధుల్లో చేరిన ఇజాజ్ ఉల్‌హక్ లీవ్‌కు సంబంధించిన బిల్లుల మంజూరుకు దరఖాస్తు పెట్టుకున్నాడు. 88రోజుల మెడికల్ లీవ్స్‌కు సంబంధించి 2.40లక్షల రూపాయల బిల్స్ ఆయనకు రావాల్సి ఉంది.

బిల్స్ రికార్డు చేయడానికి సుల్తానాబాద్‌లోని ఎస్సారెస్పీ ఆఫీస్‌లో పనిచేస్తున్న సూపరింటెండెంట్ డి శ్రీధర్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ సురేష్ 20వేల రూపాయల లంచం డిమాండ్ చేశారు. దీంతో ఇజాజ్ ఉల్‌హక్ ఈ నెల 19న కరీంనగర్‌లోని ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనమేరకు బుధవారం సుల్తానాబాద్‌లోని ఎస్సారెస్పీ ఆఫీసులో సూపరింటెండెంట్ శ్రీధర్ బాబు, సీనియర్ అసిస్టెంట్ సురేష్‌కు 20వేల రూపాయల లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో దాడిచేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని శ్రీధర్‌బాబు, సురేష్‌ను ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో డీఎస్పీ రమణమూర్తి, సీఐలు కృష్ణ, పున్నం చందర్, సిబ్బంది పాల్గొన్నారు.

భగవద్గీతకు యునెస్కో గుర్తింపు

హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా వాసులు

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా హిందూ మత పవిత్ర గ్రంథమైన భగవద్గీతకు యునెస్కో గుర్తింపు లభించింది. భగవద్గీతతోపాటు భరత ముని రాసిన నాట్య శాస్త్రానికి కూడా గుర్తింపు దక్కింది. యునెస్కో తన మెమరి ఆఫ్ వరల్డ్ రికార్డులో ఈ రెండింటికి చోటు కల్పించింది. ఈ విషయంపై జిల్లా వాసులు, గీతాపారాయణపరులు, వివిధ ఆధ్యాత్మిక, భజన, భక్తి, భజన సంగీత విభాగాలకు చెందినవారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గీతా జయంతికి కార్యక్రమాలు కూడా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ఆనంద జీవన ప్రయాణానికి గీత అవసరం

అక్షయచైతన్య, కరీంనగర్ చిన్మయమిషన్ ఆచార్యుడు



సవాళ్లు, సమస్యలకు పరిష్కారం చూపి ఆనంద జీవన ప్రయాణం చేసేందుకు ఉన్నత సూత్రాలను, నైతిక విలువలను అందించే జ్ఞాన సంపద భగవద్గీత. యునెస్కో గుర్తింపుతో గీత ప్రపంచానికి మార్గనిర్దేశనం చేస్తుందని బుజువైంది.

గర్వకారణం : బండ సత్తయ్య, గీతా భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు



భగవద్గీతకు యునెస్కో గుర్తింపు రావడం గర్వకారణం. గీతను మరిస్తే మనల్ని మనమే మరచినట్లు. గీతా భక్త సమాజం ద్వారా 14 వేల పుస్తకాలు ముద్రించాము. 10 వేల వరకు ఉచితంగా పంపిణీ చేశాం.

భగవద్గీత సారాంశాన్ని అర్థం చేసుకోవాలి

విష్ణుసేవానందగిరి స్వామి, మళయాళ సద్గురు గీతామందిర సన్యాస మఠం



భగవద్గీత మానవుల నుదుటి గీతగా చెబుతారు. భగవద్గీతలోని సూక్తులను, సారాంశాన్ని అందరూ అర్థం చేసుకొని ఆచరణలో పెడితే జీవితాలు సుగమం అవుతాయి. గీతను నిత్య పారాయణం చేయాలి. దీంతో మానసిక, శారీరక, లౌకిక ప్రశాంతత చేకూరుతుంది.

విస్తర్లే వారి జీవనాధారం

విస్తరాకులు కుడుతూ ఉపాధి పొందుతున్న రామోజిపేట మహిళలు



విస్తరాకులు కుడుతున్న మహిళలు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఇల్లంతకుంట మండల కేంద్రానికి దూరంగా చుట్టూ గుట్టల మధ్య ఉండే రామోజిపేట గ్రామానికి ఓ ప్రత్యేకత ఉంది. గ్రామానికి చెందిన దాదాపు 50 మంది మహిళలు 30 సంవత్సరాలుగా మోదుగ ఆకులతో విస్తర్లు కుడుతూ ఉపాధి పొందుతున్నారు. పేపర్‌ప్లేట్లు మార్కెట్‌లోకి రావడం వల్ల విస్తరాకులు ఆదరణ కోల్పోయినా ఇటీవల పరిణామాలతో మళ్లీ ప్రజలు విస్తరాకుల వైపు మొగ్గు చూపుతున్నారు. గతంలో గ్రామసమీపంలోని గోకరిగుట్ట, ఎడ్లేనిబోరు, ఏపగుట్టలకు ఉదయమే వెళ్లి మోదుగ ఆకులు తెచ్చుకునేవారు. ప్రస్తుతం మోదుగు చెట్లు తగ్గడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి ఆకులు తెచ్చుకుంటున్నారు. తెచ్చిన ఆకులను ఎండబెట్టి కొద్ది రోజుల తర్వాత విస్తారాకులు కుడుతారు. ప్రతి ఇంటి ఎదుట మోదుగ ఆకుల కట్టలు కనిపిస్తుంటాయి. 80 విస్తర్లు కట్టగా కట్టి అమ్ముతుంటారు. కట్టకు 130 రూపాయల వరకు అమ్ముతున్నారు. ఇక్కడి నుంచి సిరిసిల్ల, వేములవాడ, ధర్మపురి, కొండగట్టు తదితర ప్రాంతాలకు తీసుకవెళ్లి అమ్ముతుంటారు. గ్రామానికి సైతం ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేసి తీసుకొని వెళుతుంటారు.



ఇళ్ల ఎదుట ఆరబెట్టిన మోదుగ ఆకు

విస్తరాకులతో ఉపాధి పొందుతున్నాం..

ఈదుల్ల పుష్ప, గృహిణి రామోజిపేట



గ్రామంలోని మహిళలు మధ్యాహ్నం సమయంలో విస్తరాకులు కుడుతూ ఉపాధిపొందుతున్నాం. మోదుగ ఆకులు దొరకక ఇబ్బంది పడుతున్నాం. అటవీ ప్రాంతానికి వెళ్లినప్పుడు కొన్ని సార్లు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం విస్తారాకులు కుట్టడాన్ని కుటీర పరిశ్రమగా గుర్తించి రుణసహాయం అందించాలి.

మోదుగు ఆకులు దొరకడం లేదు..

బెజ్జంకి జయ, గృహిణి రామోజిపేట





విస్తరాకులు కుట్టడం వల్ల కొన్ని డబ్బులు వస్తున్నాయి. పుణ్యక్షేత్రాల వద్ద అమ్మకాలు ఎక్కువగా ఉంటాయి. కుట్టిన విస్తర్లు అమ్మడానికి ఇబ్బంది అవుతుంది. రవాణా చార్జీలు ఎక్కువ అవుతున్నాయి. ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి. బీడుభూములను సాగుచేస్తుండటం వల్ల మోదుగ ఆకులు దొరకడం కష్టంగా మారింది.

కాంగ్రెస్ పాలనలో తిరోగమనంలో రాష్ట్రం

- ఏ ఎన్నిక జరిగినా ఎగిరేది గులాబీ జెండాయే
- శాసన మండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

పెద్దపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం తిరోగమనంలో పయనిస్తున్నదని, రాష్ట్రంలో ఏ ఎన్నిక జరిగినా ఎగిరేది గులాబీ జెండాయేనని శాసన మండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. సింగరేణి బొగ్గు గనులను ప్రైవేట్ పరం కాకుండా కేసీఆర్ కాపాడితే, వాటిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కేంద్రం వద్ద తాకట్టు పెట్టారని ఆరోపించారు. బుధవారం పెద్ద పల్లిలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఒక ప్రాంతీయ పార్టీని 25 ఏళ్లు నడపడం ఆషామాషీ కాదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పుట్టుకు వచ్చిన 160 నుంచి 170 ప్రాంతీయ పార్టీలు నిలవలేకపోయాయని, ఒక్క టీడీపీ, బీఆర్ఎస్ మాత్రమే తట్టుకుని నిలబడ్డాయన్నారు. గులాబీ కండువా కనబడితే కొట్టుకోని గుండే లేదన్నారు. దేశానికే ఆదర్శంగా కేసీఆర్ తీసుక వచ్చిన రైతు బంధు పథకాన్ని కాంగ్రెస్ పార్టీ నీరుగార్చిందన్నారు.

రైతులకు భరోసా లేకుండా చేసిందన్నారు. నార్లు పోస్తే నీళ్లు వచ్చే పరిస్థితి లేదని, పండిన పంటను కొనే దిక్కులేదని అన్నారు. గ్రూపు-1 నియామకాల్లో అంతటా అవినీతి జరిగిందని, అనేక మంది నిరుద్యోగులకు అన్యాయం జరిగిందన్నారు. కేసీఆర్ కిట్‌ను అమలు చేయక, ప్రభుత్వ ఆసుపత్రులకు ప్రసవాల కోసం మహిళలు రావడం లేదని, మళ్లీ ప్రైవేట్ ఆసుపత్రుల బాట పడుతున్నారని మండిపడ్డారు. లాభాల వాటా ఇచ్చే విషయంలోనూ కాంగ్రెస్ సింగరేణి కార్మికులను మోసం చేసిందన్నారు. వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, దాసరి మనోహర్‌రెడ్డి, పుట్ట మధూకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మన్‌రావు, టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్ చిరుమళ్ల రాకేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, పార్టీ నాయకులు గంటా రాములు యాదవ్, దాసరి ఉష, పెంట రాజేష్, ఉప్పు రాజు కుమార్, బండారి శ్రీనివాస్‌గౌడ్, మర్కు లక్ష్మన్, పసుల చరణ్, బాలాజీరావు, బొడ్డు రవీందర్, నారాయణదాసు మారుతి పాల్గొన్నారు.

జేఎన్టీయూలో కొనసాగుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల సమ్మె

కొడిమ్యాల, ఏప్రిల్23 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలం నాచుపల్లి జేఎన్టీయూలో కాంట్రాక్ట్ అధ్యాపకులు చేస్తున్న సమ్మె బుధవారం ఐదో రోజుకు చేరుకుంది. కాంట్రాక్ట్ అధ్యాపకులు బైక్‌లపై ర్యాలీగా వెళ్లి కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనం చేసుకొని తమ సమస్యలను పరిష్కరించాలని స్వామి వారికి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమను రెగ్యుల రైజేషన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాప కులు డాక్టర్ రాజేష్, శ్రీనివాసారావు, యామిని, సుజాత, మధుకర్, రాజు పాల్గొన్నారు.



కొండగట్టు అంజన్న ఆలయ ఆవరణలో కాంట్రాక్ట్ అధ్యాపకులు

పీసీసీ అబ్జర్వర్లుగా సత్యనారాయణ, శ్రీనివాస్ నియామకం

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణానికి చెందిన గ్రంథాలయం జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణను కామారెడ్డి కాంగ్రెస్ పార్టీ జిల్లా అబ్జర్వర్‌గా, టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్‌ను పెద్దపెల్లి కాంగ్రెస్ పార్టీ జిల్లా అబ్జర్వర్‌గా నియమిస్తూ బుధవారం ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించి ఇచ్చిన బాధ్యతలను స్వీకరిస్తున్నామన్నారు. జిల్లాలో పార్టీ శ్రేణులను కలుపుకొని పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామన్నారు.



నాగుల సత్యనారాయణ



సంగీతం శ్రీనివాస్

బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా సమ్మయ్య



భగత్‌నగర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా పిట్టల సమ్మయ్య ఎన్నికయ్యారు. రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్‌లో యూనియన్ రాష్ట్ర నాలుగో మహాసభలు మూడు రోజులు కొనసాగాయి. ఇందులో కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలానికి చెందిన పిట్టల సమ్మయ్య రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. కరీంనగర్ జిల్లా నుంచి రాష్ట్ర కమిటీలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా గందె కొమురయ్య, రేగుల కుమార్ ఎన్నికయ్యారు. వారి ఎన్నికపై యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, అనిశెట్టి చంద్రయ్య, కన్నం సదానందం, కార్యదర్శి ఖాన్ పాష, లక్ష్మణ్, బాదుల్లా నాయకులు జగన్, రమేష్ హర్షం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్‌ను

అడుగడుగునా అవమానించింది..

బీజేపీ దళిత మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కాంగ్రెస్ పార్టీ అడుగడుగునా అవమానించిందని, అంబేద్కర్ ఆశయ సాధనతో ముందుకు సాగాలని భారతీయ జనతాపార్టీ దళిత మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్ కోరారు. భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బుధవారం జిల్లా సదస్సును జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపీ అధ్యక్షతన జరిగింది.

ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్‌ను అవమానించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి ఉందన్నారు. అంబేద్కర్ చనిపోతే ఆయన అంత్యక్రియలు ఢిల్లీలో జరగనివ్వకుండా ముంబైకి ఆయన పార్థివదేహాన్ని తర లించిందన్నారు. పార్థివదేహం తరలింపునకు అయ్యే విమాన చార్జీలు, బిల్లులు చెల్లించాలని అంబేద్కర్ సతీమణికి నోటీసులు పంపించిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉందన్నారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ, పండింత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆలోచనా విధానాన్ని బలపరిచి అంబేద్కర్‌కు ఆయన ఆలోచనలకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం తగిన గౌరవం ఇస్తోందన్నా రు. భావితరాలకు అంబేద్కర్ చరిత్ర తెలిసేలా పంచ తీర్థాలను ఏర్పాటు చేయడంతో పాటు దళితుడైన రామ్‌నాథ్ కోవింద్‌ను రాష్ట్రపతిగా చేసిందన్నారు. అణగారిన వర్గాల్లో వెలుగులు నింపిన అంబేద్కర్‌కు భారతరత్న కోసం బీజేపీ కృషి చేసిందన్నారు.

ఈ సదస్సులో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జెనవాడే సంగప్ప, దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శి కుమ్మరి శంకర్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎర్ర మహేష్, అల్లాడి రమేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మ్యాన రాంప్రసాద్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొక్కు దేవేందర్ యాదవ్, జిల్లా కార్యదర్శి రేగుల దేవేం దర్, కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీ నర్ అడెపు రవీందర్, అసెంబ్లీ నియోజకవర్గాల కన్వీనర్‌లు కారెడ్ల మల్లారెడ్డి, మరుతు సత్తయ్య, జిల్లా అధికార ప్రతి నిధి బర్కం నవీన్ యాదవ్, సంతోష్ రెడ్డి, అంబేద్కర్ జయంతి ఉత్సవాల కన్వీనర్ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు చంటి మహేష్, కో-కన్వీనర్ కొంపెల్లి రాజేందర్, యాదగిరి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.



సిరిసిల్లలో బీజేపీ సదస్సులో మాట్లాడుతున్న ఎస్ కుమార్

పగిలిన ఎన్టీపీసీ యాష్‌పాండ్ పైపులైన్



ఇళ్లలోకి చేరిన బూడిద నీరు

అంతర్గాం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లి ఏరియాలో గల అక్బర్‌నగర్ కాలనీలో బుధవారం ఎన్టీపీసీ యాష్ పాండ్‌కు వెళ్లే పైపులైన్ పగలడంతో సమీపంలోని ఇళ్లలోకి బూడిద నీరు చేరి కాలనీమొత్తం జలమయమైంది. ఎన్టీపీసీ నుంచి కుందనపల్లి యాష్ పాండ్ వెళ్లే పైపులైన్ ఇళ్లను ఆనుకొని ఉండడంతో పైపులైన్ పగలగా బూడిద నీరు లీకేజీ గంట పాటు కొనసాగింది. భయాందోళనతో కాలనీవాసులు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న ఎన్టీపీసీ అధికారులు పైపులైన్‌కు బూడిద నీటి సరఫరా నిలిపివేయడంతో కాలనీ వాసులు ఊపిరి పీల్చుకున్నారు. అప్పటికే సమీపంలోని ఇళ్లతో పాటు వందమీటర్ల మేరకు రహదారిపై బూడిద చేరడంతో ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎన్టీపీసీ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని అక్బర్‌నగర్ కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లలోకి మొత్తం బూడిద నీరు చేరడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీని స్థానిక రామగుండం ఎస్ఐ సంధ్యారాణి, కాంగ్రెస్ నాయకుడు ఎండీ ఆసిఫ్ సందర్శించారు. ఎన్టీపీసీ అధికారులు అటువైపు రాకపోవడంతో కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాజన్న హుండీ ఆదాయం

రూ. 2.01 కోట్లు

184 గ్రాముల బంగారం, 12 కిలోల 300 గ్రాముల వెండి



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజ రాజేశ్వర స్వామివారి ఆలయ ఖజానాకు రూ. 2 కోట్ల ఒక లక్ష 53 వేల 852 నగదు సమకూరినట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి వెల్లడించారు. రాజన్న ఆలయ ఆవరణలోని ఓపెన్‌స్లాబ్‌లో గత 29 రోజుల హుండీలను అత్యంత భద్రత మధ్య బుధవారం లెక్కించారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయానికి రూ. 2 కోట్ల ఒక లక్ష 53 వేల 852 నగదు ఆదాయం రాగా 184 గ్రాముల మిశ్రమ బంగారం, 12 కిలోల 300 గ్రాముల వెండి సమకూరినట్లు తెలిపారు. హుండీల లెక్కింపును ఆలయ ఈవో వినోద్‌రెడ్డి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో దేవదాయ సహాయ కమిషనర్ కార్యలయ డివిజనల్ ఇన్ స్పెక్టర్ ఎస్పీఎఫ్ సిబ్బంది, శివరామకృష్ణ భజన మండలి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

వసతిగృహాల నిర్మాణానికి మోక్షమెప్పుడో..?

- కొండగట్టు పర్యటనలో ఏపీ డిప్యూటీ సీఎంకు అధికారుల వినతి
- అంజన్న ఘాట్ రోడ్డు సమీపంలో టీటీడీ ఇంజనీరింగ్ అధికారుల స్థల పరిశీలన
- పనులు ప్రారంభించకపోవడంతో భక్తుల ఇక్కట్లు





ప్రతిపాదిత వంద గదుల నిర్మాణ ప్రాంతం

మల్యాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానం పరిధిలో ప్రతిపాదిత తిరుమల తిరుపతి దేవస్థానాల వంద గదుల నిర్మాణం ఊసే లేదు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గతేడాది జూన్ 29న కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చిన ఏపీ డిప్యూటి సీఎం పవన్‌కళ్యాణ్‌కు తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా వంద గదుల సత్రం నిర్మాణంతో పాటు రెండు వేల మంది కూర్చునే దీక్ష విరమణ మండపం ఏర్పాటుకు కృషి చేయాలని దేవస్థానం అధికారులు, అర్చకులు వినతిపత్రం అందజేశారు. దీనికి పవన్ సానుకూలంగా స్పందించగా పలుమార్లు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో పాటు దేవస్థానం అధికారులు పవన్‌కళ్యాన్ దృష్టికి తీసుకెళ్లారు.



టీటీడీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యం(ఫైల్)

ఇందులో భాగంగానే గదులతో పాటు దీక్షావిరమణ మండపం నిర్మాణంకుగాను గత అక్టోబరులో తెలంగాణలో టీటీడీ ఇంజనీరింగ్ వ్యవహారాలు పర్యవేక్షించే టీటీడీ డీఈ పీవీ.నాగరాజు, ఏఈ జే.నాగరాజు కొండగట్టుకు వచ్చారు. స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి వంద గదులు, దీక్షావిరమణ మండప నిర్మాణంకు ఘాట్‌రోడ్డు పక్కన, జేఎన్‌టీయూ కళాశాల సమీపంలో దేవస్థానం భూములను పరిశీలించారు. టీటీడీ అధికారుల పరిశీలన జరిగిన పక్షం రోజుల్లోనే దేవస్థానానికి చెందిన సర్వే నం.362/1లో గదుల నిర్మాణంకు అవసరమైన స్థలం కేటాయిస్తూ టీటీడీకి కొండగట్టు దేవస్థానం తరఫున లేఖ కూడా రాశారు. పనులను త్వరితగతిన ప్రారంభించాలని అందులో కోరారు. అయితే కొన్నాళ్లుగా గదుల నిర్మాణం ఊసే లేకుండా పోయింది. ఏపీ డిప్యూటి సీఎం చొరవతో కొండగట్టులో వంద గదుల నిర్మాణంకు అనుమతులు లభిస్తాయని భక్తులు, ఈ ప్రాంత వాసులు ఆశించారు. అయితే పవన్ కళ్యాణ్ వచ్చి ఏడాది సమీపిస్తున్నప్పటికీ టీటీడీ గదుల నిర్మాణం ప్రతిపాదనలు ముందుకు వెళ్లకపోవడంతో భక్తులు నిరాశ చెందుతున్నారు. టీటీడీ పాలక మండలి సమావేశంలో కొండగట్టు గదుల నిర్మాణాన్ని చర్చించేలా ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రత్యేక చొరవ చూపాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పరిశీలన

ఇల్లంతకుంట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తుదారుల అప్లికేషన్ల పరిశీలన కొనసాగుతోంది. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 3460మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా 3071మంది తమ దరఖాస్తులను కార్యాలయంలో అందించారు. మూడు రోజులపాటు కొనసాగిన పరిశీలనకు 2661మంది హాజరయ్యారు. మిగిలిన వారికి కూడా అవకాశం ఇస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ, సూపరింటెండెంట్ శ్రీనివాస్, సూర్య, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవన్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీడీపీవో ఉమారాణి హాజరై మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. పుట్టిన పిల్లలకు ముర్రు పాలు పట్టించాలని అన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి, పోషణ్ అభియాన్ బ్లాక్ కో-ఆర్డినేటర్ రాజు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర



రాజన్నపేటలో పాదయాత్ర నిర్వహిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట, కిష్టునాయక్‌తండా, అల్మాస్‌పూర్ గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు బుధవారం రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని మహనీయుడు అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్, బాలయ్య, శ్రీనివాస్, బుచ్చాగౌడ్, బాబు, బాల్‌రెడ్డి, శ్రీనివాస్, శంకర్, భూపాల్‌రెడ్డి, లక్ష్మణ్, సురేశ్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

'మందకొడిగా వరి కొనుగోళ్లు'

ముస్తాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వరి ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా జరుగుతున్నాయని కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్ పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో విలేకరులతో బుధవారం మాట్లాడారు. గోదాము దగ్గర 20 నుంచి 25 లోడ్‌ల వరిధాన్యం నిలిచిపోయిందన్నారు. ధాన్యం దిగుమతి ఆలస్యం అవుతున్న నేపథ్యంలో ఇటు నిర్వాహకులను రైతులను ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శీలం స్వామి, వెంకటేశ్, దుర్గాప్రసాద్, శేఖర్, చారి, ప్రవీణ్‌కుమార్, రాములు, శరత్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో సర్టిఫికెట్ కోర్సు

గంభీరావుపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎంప్లాయిబిలిటి అండ్ సాఫ్ట్ స్కిల్స్‌పై సర్టిఫికెట్ కోర్సును బుధవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ ఇప్పుడున్న రంగంలో ఇంగ్లీష్ స్కిల్స్ చాలా అవసరమని, వాటితో పాటు సాఫ్ట్ స్కిల్స్ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ పోటీ ప్రపంచంలో ఆంగ్లంపై పట్టు సాధిస్తే మంచి ఉద్యోగ అవకాశాలు మీ సొంతమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డిపార్ట్‌మెంటు ఇన్‌చార్జి ఆంజనేయులు, వైస్‌ప్రిన్సిపాల్ ప్రభాకర్, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుంది

వేములవాడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లావణ్య అన్నారు. వేములవాడలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రపంచ పుస్తక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుస్తకం అనేది మానవ జీవితంలో ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ బి. సుమలత, లైబ్రేరియన్ డా. జి. శ్రీలత, అకాడమిక్ కో ఆర్డినేటర్ సి.హెచ్. నిర్మల, హృదయ, స్టాఫ్ సెక్రటరీ జి. రజిని, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందజేత

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రతి తరగతిలో అత్యంత ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అదే గ్రామవాసి మాద లక్ష్మీనారాయణ నగదు ప్రోత్సాహకం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామచంద్రం, తాజా, మాజీ సర్పంచ్ రజిత, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి, స్థానికులు రాజయ్య, శ్రీనివాస్, కుమార్, సత్యనారాయణ, సతీష్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందనలు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన పూర్వవిద్యార్థులను ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఘనంగా సన్మానించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివి ఎంపీసీలో 982 మార్కులు సాధించి విద్యార్థి రిహాన్, ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపీసీలో 435 మార్కులు పొందిన శ్రీనిధిలను ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మనోహరాచారి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు పంపిణీ

ఇల్లంతకుంట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేపాక జిల్లాపరిషత్ పాఠశాల ఆవరణలో బుధవారం సమావేశం జరిగింది. ఉత్తమ విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు రేవతి, ఉపాధ్యాయులు సింగిరెడ్డి వీరారెడ్డి, మాధవి, రామేశ్వర్‌రెడ్డి, మల్లిఖార్జున్, సుజాత, అబ్రార్‌అహమ్మద్, మల్లయ్య, రాధ, రాణి, లీలాలతో పాటు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సన్మానం

కోనరావుపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శివ కుమార్ రెడ్డి బుధవారం మెమొంటోలు అందజేసి సన్మానించారు. ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన జాషువా, మల్లికా, అమూల్య, శ్రీజ, సంజన, హాసిని, స్పందన, జస్వంత్‌లను ప్రిన్సిపాల్ శివకుమార్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడినప్పుడే మంచి భవిష్యత్తు లభిస్తుందన్నారు.

మాతా శిశు మరణాలు జరగకుండా జాగ్రత్తలు

- గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి - కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా - వైద్య ఆరోగ్య శాఖ సేవలపై సమీక్ష


వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మాతా శిశు మరణాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల కలెక్టరేట్‌లో బుధవారం మాతా శిశుమరణాలు, టీబీ కేసులు, కుష్టు తదితర అంశాలపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో గత నెలలో ప్రసవాలు ఎన్ని చేశారో అడిగి తెలుసుకున్నారు. నెలలో మొత్తం 666 ప్రసవాలను చేశామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత కలెక్టర్‌కు వివరించారు. గర్భిణీలు, బాలింతలు, నవజాత శిశువుల మరణాలు జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లో ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రోగ్రామ్ అధికారులు, డాక్టర్‌లు, ఆశా కార్యకర్తలు నిత్యం గర్భిణులతో మాట్లాడాలని వారి కుటుంబ ఆరోగ్య చరిత్ర ఇతర వివరాలు అందుబాటులో ఉండాలన్నారు. ఆరోగ్య పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకునేందుకు ఫోన్‌లు చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ఎక్కువగా ప్రసవాలు జరిగేలా వైద్యులు శ్రద్ధ పెట్టాలని గర్భిణులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలోని ఆయా ఆసుపత్రుల్లో గైనకాలజిస్టులు అవసరం ఉంటే వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసే ఆసుపత్రులపై ప్రత్యేకంగా నిఘా పెట్టాలని, వైద్య ఆరోగ్యశాఖ నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భ్రూణహత్యలు ఎక్కడ జరుగకుండా ఉండాలన్నారు. అన్ని ఆసుపత్రుల్లో పనివేళల్లో వైద్యులు సిబ్బంది అందుబాటులో ఉండి ఉత్తమ సేవలను అందించాలని సూచించారు. జిల్లాలో టీబీ కేసులను గుర్తించేందుకు పరీక్షలు నిరంతరం చేయాలని పాజిటివ్ వచ్చిన వారికి తగిన మందులను అందిస్తూ వారిలో ఆత్మస్థైర్యాన్ని కల్పించాలన్నారు. ఆర్‌బీఎస్‌లో భాగంగా విద్యార్థులకు కంటి పరీక్షలు ఎక్కడివరకు చేశారని అడిగితెలుసుకున్నారు. లక్ష్యం మేరకు పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ అసుపత్రిలో ఉత్తమ సేవలందిస్తూ నిత్యం నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్యులు, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీనారాయణ, వేములవాడ ఏరియా అసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు..

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. పైలెట్ ప్రాజెక్ట్ గ్రామాలు, వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిపై జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి బుధవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని మండలాలు, మున్సిపాలిటీల వారిగా ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఆరా తీశారు. ఎందుకు లక్ష్యం చేరుకోలేదో వివరాలు అడిగి తెలుసుకొని, త్వరగా ఎలా పూర్తి చేయాలో సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలనేది రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన ఆశయమని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల గ్రామ, కమిటీలు గుర్తించిన వారితో పాటుగా ఎవరైనా నిరుపేదలుంటే పూర్తి వివరాలు తీసుకొని ఇళ్లు ఇవ్వాలని సూచించారు. గ్రామాలు, వార్డుల్లో గతంలో నిర్మించి మధ్యలో వదిలేసిన గృహాలను ఇందిరమ్మ ఇళ్ల పథకంలో చేర్చవద్దని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వాటిపై తర్వాత నిర్ణయం తీసుకుంటామని వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇసుక ఉచితంగా ఇస్తుందని తెలిపారు. రవాణా చార్జీలు మాత్రమే లబ్ధిదారు చెల్లించాలని పేర్కొన్నారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక అయిన గ్రామాలు, వార్డుల్లో లక్ష్యం మేరకు నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ మేరకు అధికారులు సమన్వయంతో పనిచేసి ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిఅయ్యేలా చూడాలని తెలిపారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో అధికారులు నిత్యం క్షేత్రస్థాయిలో పర్యటించి, అర్హులకు ఇళ్ల నిర్మాణాలపై సూచనలు అందించాలని, పనులు వేగంగా పూర్తి అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి, సర్వే వివరాలు ప్రతిరోజూ సాయంత్రం పంపించాలని కలెక్టర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్లో జడ్పీ సీఈవో వినోద్ కుమార్, డీఆర్డీఓ శేషాద్రి, పీడీ హౌసింగ్ శంకర్, డీఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

ఆటలతో ఆనందం

(5వ పేజీ తరువాయి)

గడిపే అవకాశం ఉండదు. వేసవి సెలవులు వచ్చాయంటే పిల్లలు ఎంచక్కా గ్రామాల్లో ఉండే అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్యల ఇళ్లకు వెళ్లవచ్చని భావిస్తారు. అక్కడ ఉండే రకరకాల బంధువులు, వారి పిల్లలతో కలిసి గడుపుతారు. వివిధ రకాల వ్యక్తులు, పిల్లలు, మాటతీరు, వ్యవహారశైలి, భావోద్వేగాలు, సాంఘిక శైలి కూడా తెలుసుకునే అవకాశం లభిస్తుంది. అంతేకాకుండా గ్రామీణప్రాంతాల్లోని సంప్రాదాయ ఆటలపై కూడా అసక్తి పెరుగుతుంది.

విహార యాత్రలకు ఏర్పాట్లు..

వేసవిలో మరికొందరు విహారయాత్రలు వెళ్లడానికి టూర్ ప్లాన్‌లు చేసుకుంటారు. పిల్లలకు సెలవులు కావడంతో కొందరు తీర్థయాత్రలకు వెళ్లి మొక్కులు తీర్చుకుంటే మరికొందరు ఊటీ, కులుమనాలి, గోవా, ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి ఏర్పాట్లు చేసుకుంటారు. కొత్త ప్రదేశాలకు వెళ్లడం ద్వారా సృజనాత్మకత పెరుగుతుందని భావిస్తారు.

వేసవిలోనూ జాగ్రత్తలు..

వేసవిలో పిల్లలపై జాగ్రత్తలు వహించాలి. భగ్గు మంటున్న ఎండలు పిల్లలను అస్వస్థతకు గురి చేస్తాయి. ప్రధానంగా మధ్యాహ్నం వేళల్లో బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండలో తిరగడం వల్ల వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. వేసవిలో ఎక్కువగా చెరువులు, వాగులు, బావుల వద్దకు ఈతకు వెళ్లడానికి ఆసక్తి చూపుతారు. ఈతలో అనుభవం లేకపోవడంతో ప్రమాదాలకు గురవుతారు. పిల్లలు సెల్‌ఫోన్, సినిమాలు చూడడం, గేమ్స్ అడడంపై కాకుండా నాలెడ్జ్ పెంచుకునే విధంగా జనరల్ నాలెడ్జ్, స్టోరీ బుక్స్ చదివే విధంగా ఆసక్తి పెంచాలి. పాజిటివ్ థింకింగ్, మెడిటేషన్, యోగాపై ఆసక్తి పెంచాలని సూచిస్తున్నారు.

ధాన్యం రాశులు పోసి ప్రమాద కారకులు కావొద్దు..

చందుర్తి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రహదారులపై ధాన్యం రాశులు పోసి ప్రమాదాలకు కారకులు కావద్దని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చందుర్తి నుంచి మోత్కురావుపేట్ గ్రామానికి వెళ్లే ప్రధాన దారిపై రైతులు, ధాన్యం కుప్పలు పోసి తగిన జాగ్రత్తలు తీసుకోకుండా ఆరబోస్తున్నారన్నారు. రోడ్లపై ధాన్యం రాశులు పోయడంతో గతంలో ఇద్దరు మృతిచెందగా, ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయన్నారు. ప్రమాదానికి బాధ్యులపైన కేసులు నమోదు చేశామన్నారు. పొలంలో వరి కోసిన తర్వాత మిగిలిన గడ్డిని కాల్చడం వలన, పక్కనేగల పశువుల కొట్టాలు, గడ్డివాములు, తగలబడే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన స్థలాల్లో వడ్లను ఆరబోసుకోవాలని సూచించారు. రోడ్లపై ధాన్యం రాశులు పోయడంతో ఏదైనా ప్రమాదం జరిగితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

ఘనంగా 'చల్మెడ' జన్మదిన వేడుకలు

వేములవాడ టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు జన్మదిన వేడుకలను అర్బన్ మండల బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు.

● రుద్రంగి : మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనర్సింహ ఆలయ ప్రాంతంలో జన్మదిన వేడుకలను నిర్వహించారు. కెక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

● చందుర్తి : మండల కేంద్రంలో వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు

● కోనరావుపేట : మండల కేంద్రంలో వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

ఉగ్రవాదుల దాడిపై వెల్లువెత్తిన నిరసనలు


సిరిసిల్లలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు



వేములవాడలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న నాయకులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : కాశ్మీర్‌లో హిందువులపై ఉగ్రవాదులు కాల్పులతో తెగబడి చంపేయడాన్ని ఖండిస్తున్నామని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపీ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. అలాగే ఉగ్రవాదుల కాల్పుల్లో మృతిచెందిన వారికి నివాళ్లు అర్పించి కొవ్వొత్తులను వెలిగించి గాంధీ విగ్రహం వరకు శాంతి ర్యాలీ తీశారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, కరీంనగర్‌పార్లమెంటరీ కో-కన్వీనర్ అడెపు రవీందర్, దుమాల శ్రీకాంత్, పండుగ మాధవి తదితరులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల టౌన్ : కాశ్మీర్ ఉగ్రచర్య ప్రజాస్వామ్యంకు గొడ్డలి పెట్టాని తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలో కాశ్మీర్ ఉగ్రచర్యను ఖండిస్తూ తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మృతిచెందిన పౌరులకు నివాళలర్పిస్తూ మౌనం పాటించారు. జిలా ప్రధాన కార్యదర్శి జనపాల శంకరయ్య, ఉపాధ్యక్షుడు ఏనుగుల ఎల్లయ్య, కోశాధికారి దొంత దేవదాస్, సభ్యులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల రూరల్ : కాశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పులను ఖండిస్తున్నామని టీఎస్ యూటీఎఫ్ రాజన్న సిరిసిల్లజిల్లా అధ్యక్షుడు పర్కాల రవీందర్ అన్నారు. సిరిసిల్లలో బుధవారం టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ అధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో కాశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పుల్లో మృతిచెందిన భారతీయలకు నివాళ్లు అర్పించారు. మాజీ అధ్యక్షుడు పాకాల శంకర్‌గౌడ్, జిల్లా కార్యదర్శి ఎలగొండ రవి, సిరిసిల్ల మండల కార్యదర్శి జంగిటి భానుచందర్, సీనియర్ ఉపాధ్యాయులు కరికె నరేందర్, శ్రీహరి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : గంభీరావుపేట మండల కేంద్రంలో బుధవారం రాత్రి ప్రజలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. మెయిన్‌రోడ్ వెంట అంబేడ్కర్ చౌరస్తా నుంచి తెలంగాణ అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ కొనసాగింది. ఉగ్రదాడుల్లో అమరులైన వారికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున పలు పార్టీలకు చెందిన నాయకులు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

● వీర్నపల్లి : ఉగ్రవాదులు భారతీయులను చంపడం పిరికిపంద చర్యను ఖండిస్తున్నామని బీజేపీ మండల అధ్యక్షుడు మాలోత్ లక్పతి నాయక్ అన్నారు. ఉగ్రవాదుల చేతిలో మరణించిన భారతీయుల ఆత్మకు శాంతి చేకూరాలని మండల కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి పిట్ల నాగరాజు, ఉపాధ్యక్షులు మాడుగుల లింబాద్రి, బండారి మహేష్, బానోతు శ్రీనివాస్, పోతారం నరేష్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : ముస్తాబాద్ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు జమ్ము కాశ్మీర్‌లో జరిగిన ఘటనపై కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. పాకిస్థాన్ ఉగ్రవాదులు జమ్మకాశీర్మర్‌లో చేసిన దాడుల్లో మృతులకు నివాళిగా కొవ్వొత్తులతో ర్యాలీ తీశారు. పాకిస్థాన్ ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు మెర్గ అంజాగౌడ్, నాయకులు సొల్ల క్రాంతి, కరెడ్ల రమేశ్‌రెడ్డి, బాద నరేశ్, గోపి, పద్మ, బాలాజీ, మీస శంకర్, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.


● వేములవాడ : జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గంలో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ బుధవారం సాయంత్రం వేములవాడలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మ శాంతించాలని కోరుతూ ఈ సందర్భంగా వారు ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకుడు ప్రతాప రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మండలకేంద్రంలోని హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలోని సభ్యులు బుధవారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. స్థానిక పాత బస్టాండు నుంచి కొత్త బస్టాండు వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం ఉగ్రమూకల దిష్టిబొమ్మను దహనం చేశారు. హిందూ ఉత్సవ సమితి సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : జమ్ము కాశ్మీర్‌లో హిందువులపై దాడులను నిరసిస్తూ తంగళ్లపల్లి మండల కేంద్రంలో బీజేపీ శ్రేణులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు, ప్రధాన కార్యదర్శి ఇటికల రాజు, నాయకులు పోకల శ్రీనివాస్, పక్కిశెట్టి రాజు, రెడ్డిమల్ల శీర్వాద్, వినయ్‌యాదవ్, నాగుల శ్రీనివాస్ జంగం కిషన్, రెడ్డిమల్ల విజేందర్, కృష్ణ, జీవన్‌రెడ్డి, కోడం భవిత, బొల్గం భాస్కర్, నేవూరి సురేశ్‌రెడ్డి, ఇటిక్యాల మహేందర్ పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : ఉగ్రమూకల దాడిలో ప్రాణాలుకోల్పోయిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కాంక్షిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు భూమండ్ల అనిల్‌కుమార్, నాయకులు అనిల్, రవి, మారుతి, గోపాల్, కమలాకర్‌రావు, లంకోజు చంద్రం, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి : జమ్ము కాశ్మీర్ పహల్‌గాంలో ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన హిందువుల ఆత్మకు శాంతి చేకూర్చాలని కోరుతూ చందుర్తి మండల కేంద్రంలో బుధవారం రాత్రి బీజేపీ నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులు అర్పించారు. అనంతరం ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మండల అధ్యక్షుడు మొకిలే విజేందర్, వేములవాడ అసెంబ్లీ కన్వీనర్ మార్త సత్తయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్, నాయకులు చిర్రం తిరుపతి, మోత్కుపల్లి రాజశేఖర్, చింతకుంట సాగర్, పాటి సుధాకర్, మర్రి మల్లేశం, లోకిజీ సతీష్, ఉపాధ్యక్షులు మటకం మల్లేశం, కొక్కుల నరేష్, ఎంజాల శ్రీనివాస్, చిలుమాల హనుమయ్య చారి, రాజు దివ్య సాగర్, బొప్ప వెంకన్న, బోరుగాయ తిరుపతి, కూసుంబ కిష్టస్వామి, శ్రీకాంత్ ,శ్రీనివాస్ పాల్గొన్నారు.


గంభీరావుపేటలో కొవ్వొత్తులతో ర్యాలీ..

భూ భారతి చట్టంతో భూ సమస్యలు పరిష్కారం


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టం ద్వారా గతంలో ఉన్న భూ సమస్యలకు ఒక పరిష్కారం మార్గం ఏర్పడుతుందని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేటలో బుధవారం భూభారతి చట్టంపై రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సరైన ప్రణాళికతో భూ భారతి చట్టాన్ని తీసువచ్చిందన్నారు. భూ సమస్యలతో బాధపడే వారంతా చట్టాన్ని సద్వినియోగం చేసుకొని హక్కులు పొందాలని పిలుపునిచ్చారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం అందజేస్తారన్నారు. ప్రజా ప్రభుత్వంలో 20వేల కోట్ల పైచిలుకు రూపాయలతో 2లక్షల వరకు రుణమాఫీ చేశామన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, 500కి సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంలాంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం అమలు చేసే పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. హన్మాజీపేట్ బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకవచ్చామన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. ధరణిని అడ్డంపెట్టుకొని చాలావరకు భూములను గ్రామాల్లో పట్టణాల్లో దోచుకున్నారన్నారు. ఆనాడు అధికారంలోకి రాగానే ధరణిని బంగాళాఖాతంలో కలుపుతామని ఇచ్చిన మాట ప్రకారం భూభారతి తీసుకవచ్చామన్నారు. రాబోవు రోజుల్లో ప్రజా ప్రభుత్వంలో అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలన్నారు. గతంలో తాను ముమ్మాటికీ భారతీయుడినని అని ప్రగల్భాలు పలికిన వ్యక్తి కూడా న్యాయస్థానంకు తలవంచి 30లక్షల చెల్లించారన్నారు. పొట్టొన్ని పొడుగోడు కొడితే పొడుగోన్ని పోచమ్మ కొట్టినట్లు ఇక్కడ కూడా అలాగే జరిగిందన్నారు. పజలంతా అప్రమత్తంగా ఉండాలి. 15 సంవత్సరాల తర్వాత అయినా న్యాయం గెలిచిందన్నారు. రాజకీయలకతీతంగా అభివృద్ధి పథంలో తీసుకెళ్తానన్నారు. అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. ధరణి స్థానంలో కొత్త భూమి హక్కుల రికార్డు భూ భారతి రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకవచ్చిందని తెలిపారు. రెండు చట్టాల మధ్య తేడాలను వివరించారు. హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం ఉందని, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చెయ్యడానికి ముందు భూముల సర్వే, మ్యాప్ జియో ట్యాగింగ్‌తో పాస్‌బుక్కులు జారీచేస్తారని వివరించారు. పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం లభిస్తుందని వెల్లడించారు. వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్ చేసే ముందు నిర్ణీత కాలంలో విచారణ చేస్తారని, భూమి హక్కులు ఎలా సంక్రమించినా మ్యుటేషన్ చేసి రికార్డులలో నమోదు చేస్తారని వివరించారు. ఏఎంసీ చైర్మన్ రొండి రాజు, వేములవాడ అర్బన్, రూరల్ తహసీల్దార్లు విజయ్ ప్రకాష్‌రావు, అబూబాకర్, ఏవో సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవాలి

వీర్నపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని వీర్నపల్లి మండల విద్యాధికారి తుమ్మ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంఈవో, గర్జనపల్లి ఉన్నత పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల సమావేశానికి హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు సాధించిన ప్రగతి పత్రాలను, స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ ముద్రించిన విద్యార్థుల క్యాలెండర్లను హెచ్‌ఎం వెంగల శ్రీనివాస్‌తో కలిసి అందజేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ లాస్య, స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ రాకేష్‌గౌడ్, ఉపాధ్యాయులు ప్రేమ్‌సాగర్, బలరాం నాయక్, మంజుల, శ్రీనివాస్, కవిత, రవినాయక్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మే డే పోస్టర్ ఆవిష్కరణ

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం మేడే వాల్‌పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కడారి రాములు మాట్లాడుతూ మే 1న నిర్వహించే మేడేను విజయవంతం చేయాలన్నారు. మే 21, 22న శంషాబాద్‌లో జరిగే 4వ తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ అండ్ వర్కర్స్ యూనియన్ మహాభలను విజయవంతం చేయాల న్నారు. అనంతరం మహాసభకు కౌన్సిల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా కడారి రాములు, సభ్యులుగా బొల్లె బాబు, గాజుల పోశెట్టి ఎంపిక కావడంతో వారిని సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, సభ్యులు మీసం లక్ష్మణ్, రవీందర్, అనసూయ, రవి, ప్రమీల పాల్గొన్నారు.